క్లుప్తంగా

జామియా మసీదులో కమిషనర్ ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న కర్నూలు రేంజ్ ఇన్‌కం ట్యాక్స్ జాయింట్ కమిషనర్ అనీస్‌ఖాన్

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని షాహి జామియా మసీదును కర్నూలు రేంజ్ ఇన్‌కం ట్యాక్స్ జాయింట్ కమిషనర్ అనీస్‌ఖాన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయనకు జామియా మసీదు ట్రస్టీ సభ్యులు సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద మసీదు అని, చాలా ప్రశాంతంగా ఉందని చెప్పారు.

నేటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

పెద్దకడబూరు: మండలంలోని కల్లుకుంట గ్రామంలో శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హాజరవుతారని చెప్పారు. కార్యక్రమానికి అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

భక్తుల లగేజీని ఉంచుకోరాదు



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ వెంట తెచ్చుకున్న లగేజీ, సెల్‌ఫోన్‌లను టెంకాయల, వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాదారులు ఉంచుకోరాదని ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యాపారం కోసం భక్తులకు సంబంధించిన లగేజీ, సెల్‌ఫన్‌లను దుకాణాల్లో ఉంచుకోరాదని, అలా కాదని ఉంచుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తులు దేవస్థానం వారు ఏర్పాటు చేసిన లగేజీ కౌంటర్లలోనే ఉంచి రశీదు తీసుకోవాలని సూచించారు.

సినిమా విజయం సాధించాలని..



మంత్రాలయానికి బయల్దేరుతున్న దర్శకుడు రత్నతీర్థ అర్జున్

మంత్రాలయం : తాను దర్శకత్వం వహించిన సినిమా విజయం సాధించాలని..రత్నతీర్థ అర్జున్ అనే దర్శకుడు బెంగళూరు నుంచి మంత్రాలయానికి పాదయాత్రగా గురువారం చేరుకున్నారు. ఇటీవల కొత్త నటీనటులతో కలసి 'అల్లేడ్రా.. అల్లే బహుమాన' పేరుతో సినిమాను పూర్తిచేశారు. సినిమాను ఇంకా రిలీజ్ చేయలేదు. దీంతో సినిమా విజయం సాధించాలని కోరుకుంటూ బెంగళూరు నుంచి ఒంటరిగా ఈ నెల 18వ తేదీన బయల్దేరారు. గురువారం రాత్రి మంత్రాలయం చేరుకున్నారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సినిమాను విడుదల తేదీని ఇంకా నిర్ణయించలేదని పేర్కొన్నారు. ఆధ్యాత్మికకు సంబంధించిన కథనంతో సినిమాను చిత్రీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

సమ్మతగేరి రోడ్డుకు మహర్దశ

హొళగుంద: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చొరవతో దశబ్దాల కాలంగా మరమ్మతులకు నోచుకోని సమ్మతగేరి రోడ్డు కొత్త రూపు తెచ్చుకుంది. దాదాపు 2.5 కి.మీ దూరం ఉన్న గ్రామానికి చేరుకోవడానికి నిత్యం ప్రయాణంలో నరకం చూసే ప్రజలకు త్వరలోనే కష్టాలు తీరనున్నాయి. మంత్రి గుమ్మనూరు జయరాం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామానికి తారు రోడ్డు ఏర్పాటు చేసేందుకు రూ.1.20 కోట్లు మంజూరు చేయించడంతో గురువారం పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత్, పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో పాటు గ్రామస్తుల సమక్షంలో కాంట్రాక్టర్ రమేశ్‌రెడ్డి పూజలు నిర్వహించి తారు రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన మంత్రి గుమ్మనూరు జయరాంకు గ్రామ నాయకులు తప్పెట శోభరామిరెడ్డి, రామిరెడ్డి, అడ్వకేట్ లక్ష్మీకాంత్, కాంట్రాక్టర్ రమేశ్‌రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

ఆలూరు: భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాదాసి మాదారి కురుబ సంఘం నాయకులు గురువారం ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎల్లార్తి రోడ్డు సమీపంలోని విగ్రహం ధ్వంసానికి పాల్పడిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

భక్తులతో పోటెత్తిన ఉరుకుంద క్షేత్రం



ఈరన్నస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు



ఆరుబయటే వంటలు వండి పూజలు చేస్తున్న భక్తులు



తుంగభద్ర దిగువ కాలువలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ గురువారం సందర్భంగా ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఉరుకుంద క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో తెల్లవారుజామున 3గంటల నుంచి దర్శనానికి అనుమతించారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయి దేవాలయం వెలుపలకు బారులుదీరారు. స్వామిని దర్శించుకుని నైవేద్యం సమర్పించడానికి భక్తులు బుధవారం రాత్రి నుంచే తరలిరావడంతో క్షేత్ర పరిసరాలు జన సంద్రంగా మారాయి. భక్తులు క్షేత్ర ఆవరణలో వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారు జామున స్వామికి సుప్రభాతసేవ, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. కోసిగి సీఐ ఏరిషావలి కౌతాళం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పోలీసు బందోబస్తును నిర్వహించారు.

భక్తుల 12.30 గంటలకే భోజనాలు..

దర్శనానికి వచ్చే భక్తులు ఇక నుంచి స్వామికి నైవేద్యం సమర్పించిన వెంటనే అన్నదానంలో భక్తులకు భోజనాలు ప్రారంభించాలని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అధికారులకు సూచించారు. ఆయన గురువారం అన్నదానం సత్రంలో భోజనాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ శ్రావణమాస ఉత్సవాల వరకు అన్నదానంలో భక్తులకు స్వామికి నైవేద్యం సమర్పించిన వెంటనే భోజనాలు వడ్డించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒంటి గంటకు భోజనాలు ప్రారంభమైతే భక్తులు ఇబ్బందులు పడుతారని అందుకే వేళలు మార్చామన్నారు.

హానవాల్ గ్రామంలో కార్డన్ సెర్చ్



అనుమానితుల ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ చిన్నపీరయ్య, పోలీసులు



పత్రాలు సరిగాలేని వాహనాలను చూపుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి, పోలీసులు

ఆదోనిరూరల్ : పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని హానవాల్ గ్రామంలో గురువారం తెల్లవారు జామున ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ఆదోని సబ్‌డివిజన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా కలిగి ఉన్న 236 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనం, సరైన ధ్రువపత్రాలు లేని 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడుతూ..ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు లేని వాహనాలు, సెల్‌ఫోన్‌లు కొనుగోలు చేయకూడదన్నారు. హానవాల్ గ్రామం కర్ణాటక రాష్ట్రంకు అతి తక్కువ దూరంలో ఉందని, అక్కడి నుంచి అనుమతులు లేని వాటిని అక్రమ రవాణా చేయకూడదని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, పెద్దతుంబళం ఎస్‌ఐ పీరయ్య, ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు, 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రుద్రగౌడ

కోసిగి: సభ్యులు సమస్యలను లేవనెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కారంకు కృషి చేయాలే తప్పా ఇది నాకు సంబంధించినది కాదని ఇతర శాఖల అధికారులపై నెట్టేయడం మంచికాదని తహసీల్దార్ రుద్రగౌడ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షత, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన మండల ఉపాధ్యక్షులు ఆవుల నాగమ్మకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి ఎన్ఆర్ఈజీఎస్ కింద కేంద్రం నిధులు రూ.30వేల నగదు ఇంత వరకు ఒక్కరికీ రాలేదని అగసనూరు సర్పంచ్ వడ్డే ఉలిగయ్య, ఇతర గ్రామాల సర్పంచ్‌లు హౌసింగ్ ఏఈ శేఖర్ బాబును ప్రశ్నించారు. అది తమకు సంబంధించినది కాదంటూ ఆయన ఉపాధి ఏపీఓ జయరాంపై నెట్టేశారు. హౌసింగ్ నుంచి లిస్ట్ రాలేదంటూ ఏపీఓ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. తహసీల్దార్ జోక్యం చేసుకుని అధికారులు అందరు ఒకే మండలంలోనే పనిచేసేవాళ్లమే కదా, కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించి ప్రజలు లబ్ధి పొందేలా చూడాలే తప్పా, ఒకరిపై ఒకరు నెట్టేయడం మంచిది కాదని సూచించారు. అలాగే కోసిగి పరిసర కొండల్లో సంచరిస్తున్న చిరుతలను బంధించి అటవీ ప్రాంతాలకు తరలించాలని ఆదోని ఫారెస్ట్ రేంజ్ అధికారిణి తేజస్విని సభ్యులు కోరారు. కొండ చుట్టూ నివాసాలు ఉన్నాయని, చిన్నారులు ఎక్కువగా తిరుగుతుంటారని తిరుపతి చిన్నారి పై దాడి ఘటన పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఉన్నతాధికారులు సమస్యను తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, పంచాయతీ రాజ్‌ఏఈ యుగంధర్ రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ వీరేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ విజయకుమారి, కాత్యాయిని, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి చూపుతాం.. రండి



సమస్యలను కమిషనర్‌కు వివరిస్తున్న వైస్ చైర్మన్ నరసింహులు

ఆదోనిటౌన్ : ఆదోనిలో అభివృద్ధి ఎక్కడ జరిగిందంటూ ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు చైర్‌పర్సన్ బోయ శాంత అభివృద్ధి ఎక్కడ చేశామో చూపిస్తాం రండి అంటూ సవాల్ విసిరారు. ఏయే ప్రాంతంలో ఎన్ని లక్షలతో ఎన్ని పనులు చేశామో చూపిస్తామని విమర్శలకు సమాధానమిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో వార్డువార్డున సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువలు, ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు, నీటి సరఫరా, పైపులైన్లు తదితర వాటిని ఎలా అభివృద్ధి చేశామో కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గురువారం చైర్‌పర్సన్ శాంత అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం జరిగింది. ప్రతినెలా లక్షల్లో, కోట్లలో అభివృద్ధి పనులు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం పొందుతుందన్నారు. ఆ మేరకు పనులు చేస్తున్నారా లేదా అంటూ అధికారులను ప్రశ్నించారు. ఇన్ని కోట్లతో పనులు జరుగుతున్నా పట్టణంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందంటూ తమను ప్రశ్నిస్తున్నారని, వారికి ఏమి చెప్పాలని కమిషనర్ వాపోయారు. సభ్యుల వాదనపై చైర్‌పర్సన్ స్పందిస్తూ.. అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపుతామన్నారు. నాలుగేళ్లలో దాదాపు రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,98,6,000, యునైటెడ్ గ్రాంట్ రూ.2 కోట్లతో 72 పనులు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం అజెండాలో పెట్టామని తెలిపారు. ఐకేపీ, మెప్మా ప్రాజెక్టు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు నాగరత్నమ్మ, పార్వతి, ఎస్.పి.లక్ష్మీదేవి, రఘునాథ్‌రెడ్డి, ఇంతియాజ్, ఫయాజ్‌అహ్మద్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆ ప్రాజెక్టు అధికారులకు కమిషనర్, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు అంటే లెక్కలేకుండా పోయిందని నిలదీశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని నరసింహులు డిమాండ్ చేశారు. ప్రభుత్వపరంగా జరిగే కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యధోరణి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. వెంకన్నబావిలో చిన్న పిల్లలు ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్నారని కంచె ఏర్పాటు చేయాలన్నారు.

జయహో భారత్....

చంద్రయాన్–3 విజయం కావడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్‌ల తరఫున రఘునాథ్‌రెడ్డి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

తిరుమలనగర్‌లో చోరీ

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని తిరుమలనగర్‌లో నివాసముంటున్న సరస్వతి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. త్రీటౌన్ ఎస్‌ఐ జయశేఖర్ గురువారం మాట్లాడుతూ..సరస్వతి ఈనెల 14న పని నిమిత్తం కర్నూలుకు వెళ్లి 20వ తేదీన రాత్రి ఇంటికి చేరుకుంది. అయితే అప్పటికే ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉండటంలో దొంగతనం జరిగిందని భావించి ఇంట్లోకి వెళ్లి చూడగా.. ఐదు తులాల బంగారం, రూ.35 వేలు నగదును ఎత్తుకెళ్లారని గుర్తించింది. ఈనెల 22వ తేదీన బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బసాపురం ట్యాంకు నిర్మాణంలో నాణ్యతా లోపం

ఆదోనిరూరల్ : పట్టణానికి తాగునీరు అందించేందుకు 2002–2005 లో నిర్మించిన బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణంలో నాణ్యత లోపించిందని, ఇప్పటికే మూడుసార్లు కట్ట కుంగిపోయిందని సీపీఎం జిల్లా క్యాదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్ రాధాకృష్ణ పేర్కొన్నారు. కుంగిపోయిన ఎస్ఎస్ ట్యాంకు కట్టను సీపీఎం బృందం గురువారం పరిశీలించింది. వారు మాట్లాడుతూ రూ.36 కోట్లతో నిర్మించిన ట్యాంకు కట్ట 2021లో రెండుసార్లు, ప్రస్తుతం దాదాపు వంద మీటర్ల మేర కుంగిపోయిందన్నారు. పూర్తిస్థాయిలో నీటితో నింపితే కట్ట తెగిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా పట్టణ కార్యదర్శి డి.లక్ష్మన్న, మండల కార్యదర్శి లింగన్న, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.గోపాల్, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, వీరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

సోనా బియ్యం పేరుతో మోసం

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని శంకర్‌నగర్‌లో ఓ వ్యక్తి సోనా మసూరు బియ్యం అని రేషన్ బియ్యాన్ని అమ్మి మోసం చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. 50 కేజీల ప్యాకెట్ రూ.2 వేలకు ఇస్తానని చెప్పి కాలనీవాసులను నమ్మించి 50 ప్యాకెట్లు విక్రయించి ఉడాయించాడు. కొనుగోలు చేసిన తరువాత గమనిస్తే రేషన్ బియ్యాన్ని పాలిష్ చేశారని తెలుసుకొని మోసపోయామని వాపోయారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

చిప్పగిరి: బెల్డోణ సహకార సంఘం (సొసైటీ బ్యాంకు)లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని బ్యాంకు సీఈఓ హరికృష్ణ సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. మండలంలో చేయూత, రైతు నేస్తం, పంట తదితర రుణాలు మంజూరు చేశామని, సకాలంలో వడ్డీ చెల్లించని రైతులకు నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులపై స్పందించని రైతుల భూములను నిబంధనల ప్రకారం వేలం వేస్తామని హెచ్చరించారు.

చంద్రయాన్–3 విజయోత్సవ సంబరాలు



ఆదోనిలో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు



మంత్రాలయంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సంబరాలు చేసుకుంటున్న విలేకరులు



కౌతాళంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్ : చంద్రయాన్–3 విజయవంతం కావడంతో పట్టణంలోని అక్షరశ్రీ పాఠశాల విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం విద్యార్థులు పట్టణ వీధుల్లో జయహో భారత్, జయహో చంద్రయాన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయవంతం కావడం మన దేశం గర్వించ దగ్గ విషయమన్నారు. పాఠశాల డైరెక్టర్ మేఘనాథరెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

కౌతాళం: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో గురువారం స్థానిక ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలతో గ్రామ వీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ దూద్‌బాషా మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా చంద్రయాన్–3 విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.హెచ్ఎం జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు రాజేశ్వరి, రాజు, భీమేష్, పరమేష్, మైనుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షం కోసం గాయత్రీ మంత్ర జపం



పంచముఖి గాయత్రీ మాత ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత ఆలయంలో గురువారం శంకరబండ గ్రామానికి చెందిన భక్తులు వర్షాలు కురవాలని కోరుతూ గాయత్రీ మాత జపం చేస్తూ భజన చేపట్టారు. రామలింగేశ్వర స్వామి కొలను నుంచి నీటిని తెచ్చి ఆలయంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళహారతులు తదితర పూజలు నిర్వహించారు. రామతీర్థానికి కి.మీ దూరంలో ఉన్న శంకరబండ గ్రామానికి చెందిన మహిళలు కలశాలు, 108 నీళ్ల బిందెలతో గాయత్రీ నామ స్మరణ చేస్తూ అమ్మవారి ఆలయం చేరుకొని నిండు బిందెలను ఉంచారు. భక్తులు తెచ్చిన నీటితో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గాయత్రీ మాతకు జలాభిషేకం చేయనున్నట్లు ఆలయ అర్చకుడు రూపామోహన్‌శర్మ తెలిపారు. సర్పంచ్ విజయలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

మద్దికెర: బసినేపల్లి గ్రామంలో గురువారం వర్షం కోసం గ్రామ ప్రజలు కాశింతాత స్వామి వారిని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. అనంతరం స్వామి వారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చదివింపులు నిర్వహించారు. ప్రజలకు ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామపెద్దలు మాట్లాడుతూ.. పూజలు చేస్తే తప్పనిసరిగా వర్షాలు కురుస్తాయనే నమ్మకం ఉందన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎస్‌ఐ డాక్టర్ నాయక్

ఆలూరు రూరల్: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆలూరు ఎస్‌ఐ డాక్టర్ నాయక్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 'విద్య ప్రాముఖ్యత– విద్యను నిర్లక్ష్యం చేయడంతో కలిగే నష్టాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఎస్‌ఐ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. వీటిని అందిపుచ్చుకుని కష్టపడి చదివి ఉన్న స్థాయికి ఎదగాలన్నారు. మంచి సమాచారం కోసం మాత్రమే సెల్‌ఫోన్లు వాడాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వీరేష్ పాల్గొన్నారు.

తప్పుడు రీ ఫండ్ క్లెయిమ్‌లపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను జాయింట్ కమిషనర్ అనీష్‌ఖాన్

ఆదోనిఅర్బన్ : ఆదాయపు పన్ను వివరాలు తప్పుగా సమర్పించినా, అర్హతలేని మినహాయింపులు క్లెయిమ్ చేసి రీఫండ్ పొందితే పన్ను చెల్లింపుదారులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆదాయపు పన్ను జాయింట్ కమిషనర్ అనీష్‌ఖాన్ తెలిపారు. స్థానిక ఆదోని ఆదాయపు పన్నుశాఖ కార్యాలయంలో ఆడిటర్లు, టాక్స్‌బార్ అసోసియేషన్ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా తప్పుడు వివరాలతో రీఫండ్ పొందితే 12 శాతం వడ్డీతో పాటు 200 శాతం వరకు అపరాధ రుసుము వసూలు చేయడంతోపాటు రెండేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉంటుందన్నారు. గత సంవత్సరం ఆదోనిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రభుత్వరంగ సంస్థలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తప్పుడు క్లెయిమ్‌లతో 75–90 శాతం వరకు రీ ఫండ్ పొందిన ఉదంతాలు బహిర్గతమయ్యాయన్నారు. ఇప్పటికే తప్పుడు క్లెయిమ్‌లు చేసి రీ ఫండ్‌లు పొందిన పన్ను చెల్లింపుదారులు సవరించిన రిటర్న్ దాఖలు చేసి పన్ను చెల్లించాలన్నారు. 2023–24 కోసం ఇప్పటికే రిటర్న్‌లు సమర్పించినవారు సవరించిన రిటర్న్ దాఖలు చేయవచ్చన్నారు. ఆదోని ఆదాయపు పన్ను అధికారి ఎం.స్టెల్లా రోసలిండ్, నంద్యాల ఆదాయపు పన్ను అధికారి, నందవరం శ్రీధర్‌రావు, టాక్స్ బార్ అసోసియేషన్ చార్టర్డ్ అకౌంటెంట్లు విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, దైవాదీనంరెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రయోగానికి ప్రోత్సాహం

- విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు 'ఇన్‌స్పైర్ మనక్'
- దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వరకు సమయం
- ఉన్నత పాఠశాల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నమోదు చేయాలి
- జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు



ఆదోనిలో నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

చిన్నారుల మెదళ్లలోని ఆలోచనలకు రూపమిచ్చేందుకు, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు, వారిలో శాస్త్ర, సాంకేతిక అంశాలు, నూతన ఆవిష్కరణలపై ఉత్సాహం పెంపొందించేందుకు కేంద్రశాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను బాలశాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు, నగదు ప్రోత్సాహకం అందజేస్తారు.

ఆదోని సెంట్రల్: శాస్త్రీయ పద్ధతిలో, సమాజానికి ఉపయోగ పడేలా విద్యార్థులు ప్రయోగాలు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు ఏటా కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రస్తుతం 2023–24 విద్యాసంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానించింది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు 2009 నుంచి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది.

పోటీలు ఇలా..

ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు 17, ఉన్నత పాఠశాలలు 23 ఉన్నాయి. 6 – 10వ తరగతి వరకు 27,528 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ఉన్నత పాఠశాలలు 5 ప్రాజెక్టుల దరఖాస్తులు వచ్చేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వారు రాష్ట్ర స్థాయిలో పాల్గొనాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో రాణించిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. అక్కడ సత్తా చాటిన విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందజేస్తారు.

దరఖాస్తు ఇలా..

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు సంబంధించిన ప్రాజెక్టు వివరాలను పాఠశాల ఐడీతో గడువులోపు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థులు నమోదు చేసిన దరఖాస్తు సంబంధిత జిల్లా అధికారులకు చేరుతుంది. అమోదించిన దరఖాస్తును దరఖాస్తు దారుడు ఇచ్చిన ఈ–మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది. ఐడీకి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. అనంతరం విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి. నామినేషన్ కసరత్తు పూర్తయిన తర్వాత పోటీల ప్రదర్శన ఉంటుంది. ఈ పోటీలలో జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి రూ.40 వేలు, జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి రూ.60 వేలు నగదును బహుమతిగా విద్యార్థి అకౌంటులో జమ చేస్తారు.

ప్రతిభను వెలికితీయొచ్చు



ఇన్‌స్పైర్ మనక్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చు. బాల్యంలోనే శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుంది. ప్రయోగాలు చేసే ప్రతి ప్రాజెక్టులో విద్యార్థుల ఆలోచనతో చేసేలా వారిని పురిగొల్పాలి. అప్పుడే విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలతో ప్రాజెక్టును పూర్తి చేయగలుగుతారు. ప్రాజెక్టు నిర్మాణంలో తక్కువ ఖర్చు, ఎక్కువ లాభం వచ్చే వాటిపై అవగాహన కల్పిస్తే భావితరాలకు శాస్త్రవేత్తలను అందించవచ్చు. **– సుధాకర్, సైన్స్ ఉపాధ్యాయుడు**

ప్రతి పాఠశాల నుంచి నామినేషన్ ఉండాలి



ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ మనక్‌కు నామినేషన్‌ను తప్పక దరఖాస్తు చేయాలి. ఆదోనిలో 17 ప్రాథమికోన్నత, 23 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటి వరకు కొన్ని పాఠశాలలు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖాలు చేయడానికి ఈ నెల 31వ తేదీ వరకు సమయం ఉంది. సైన్సు ఉపాధ్యాయులు తప్పకుండా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ప్రయోగాలు పర్యావరణ హితంగా, సమాజానికి ఉపయోగ పడే విధంగా ఉండాలి. **– బి.శివరాములు, ఎంఈఓ**